క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రజలు తగిన శ్రద్ధ వహించాలని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం తదితర గ్రామాల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్యశాఖ సిబ్బంది పర్యటించి తాగునీటి వాడకం, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెదురుమదురు వర్షాల కారణంగా గ్రామాల్లో అపారిశుధ్యం తలెత్తి డయేరియా, టైఫాయిడ్, మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు సక్రమించే అవకాశం ఉందన్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తాగునీరు వినియోగంపైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి కె.రవిప్రసాద్, ఎస్.తాతారావు, ఆరోగ్యశాఖ సిబ్బంది రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైల్ తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి


సబ్‌జైల్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

రామచంద్రపురం: జిల్లా డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి రామచంద్రపురం సబ్ జైలును మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జైలులో ముద్దాయిల కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే ఆహారాన్ని, స్టోర్ రూమ్‌లో నిత్యవసరాలను, జైలులో ఉండే రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిసరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత న్యాయ సలహా కావలసినవారు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీని, మండలంలో మండల లీగల్ సర్వీస్ కమిటీని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైగా హరీష్‌కుమార్ నియామకం



కపిలేశ్వరపురం: అంగర పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.హరీష్‌కుమార్ సోమవారం రాత్రి బాధ్యతలను చేపట్టారు. ఇటీవల ఆయన అల్లవరం ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై అంగర పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న డి.రవికుమార్ పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎస్సై హరీష్‌కుమార్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు సిబ్బందితో కలిసి తనవంతు కృషి చేస్తానన్నారు.

హ్యూమన్‌రైట్స్ ఉపాధ్యక్షుడి ఎన్నిక


సత్య శివరామ్

కపిలేశ్వరపురం: ఢిల్లీకి చెందిన హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్, యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థకు ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను నియమించినట్టు కాలేరుకు చెందిన చుండ్రు సత్యశివరాం మంగళవారం తెలిపారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు డా.కేఎస్ జ్యోతి శేఖర్ రెడ్డి మంగళవారం నియామక ఉత్తర్వులు పంపినట్టు ఆయన తెలిపారు. తాను ప్రస్తుతం రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థలో సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నానన్నారు. సామాజిక సమస్యల పరిష్కారానికై సంస్థ ద్వారా కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం, కె.గంగవరం మండలం, రాయవరం మండలం, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సూచనల మేరకు ప్రధానమైన 132 కేవీ సామర్లకోట–రామచంద్రపురం డబుల్ సర్క్యూట్ వన్ అండ్ టూ లోను, ఏపీట్రయం వద్ద పాడైపోయిన కండక్టర్, ఎక్విప్‌మెంట్‌లను మార్పు చేయడంలో భాగంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లూరు గ్రామంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు మంగళవారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాలేరు ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. కావున వినియోగదారులు సహకరించాలని రత్నాలరావు కోరారు.

పుడమితల్లికి పచ్చబొట్లు

- మండలంలో ప్రారంభమైన ఖరీఫ్ సాగు
- దుక్కులకు రెడీగా ఉన్న భూముల్లో నాట్లు మరూ
- 1.01 లక్షల ఎకరాల్లో సాగు
- జాడలేని రుతుపవనాలు


వరి నారుమడిని సిద్ధం చేసుకుంటున్న రైతు


వెదురుపాకలో నాట్లు వేస్తున్న కూలీలు

రాయవరం: ఏరువాక సాగారో రన్నో రైతన్నా.. నీకష్టమంతా తీరునురో అన్నో రైతన్నా అంటూ రైతులు తొలకరి పనులు ప్రారంభించారు. మట్టిని నమ్ముకున్న అన్నదాతలు ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా సేద్యాన్ని చేపడుతున్నారు. మరోమారు ప్రపంచానికి అన్నం పెట్టేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ పనుల్లో భాగంగా రైతులు వరిసాగు పనులు ముమ్మరం చేస్తున్నారు. పల్లెపడుచులే కాదు..బెంగాలీ బాబులు కూడా భూమాతకు వరినాట్లను పచ్చబొట్లుగా అద్దుతున్నారు. తొలకరి పూర్తి స్థాయిలో పలకరించక పోయినప్పటికీ బోర్లపై వరిసాగు చేసే రైతులు ఏరువాకసాగారో అంటూ సేద్యం ప్రారంభించాడు. మట్టినే నమ్ముకున్న అన్నదాతలు కష్టనష్టాలను పక్కన పెట్టి మరో మారు కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

1.01 లక్షల ఎకరాల్లో..

క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో రైతులు 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగుకు సిద్ధం చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు స్వర్ణ రకాన్ని 60 శాతం, ఎంటీయు 1318, రబీలో విత్తనాలను సిద్ధం చేసుకోవడంలో భాగంగా ఎంటీయూ 3626(బొండాలు), బీపీటీ 5204(సాంబమసూరి), ఎంటీయు 1112, 1064(అమర), 1156 తదితర రకాలను 20 శాతం రైతులు సాగుచేస్తున్నారు. స్వర్ణ రకానికి బదులుగా ఎంటీయు 1318 రకాన్ని రైతులు సాగు చేపట్టాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పలకరించని తొలకరి

ఈ సంవత్సరం, ఖరీఫ్ సీజన్ వర్షాలు ముందుగానే పలకరించిన అనంతరం వర్షాలు ఆశాజనకంగా కురవలేదు. అయిన రైతన్న ధైర్యంగా వరినాట్లకు తమ పొలాలను సిద్ధం చేసుకుని, వరి నారును నాటడం ప్రారంభించారు. జిల్లా వ్యవసాయాధికారులు కూడా రైతులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు.

ముందుగానే బోరులపై వరి నారుమడులను సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్లుకు శ్రీకారం చుట్టారు. క్లస్టర్ పరిధిలో ఎప్పుడూ వరినాట్లలో ముందుండే వి.సావరం గ్రామాన్ని అధిగమించి పసలపూడిలోనూ వరినాట్లు ప్రారంభించారు. పసలపూడి, వి.సావరం, వెదురుపాక, సోమేశ్వరం, చెల్లూరు, వెంటూరు, అర్తమూరు, మండపేట, తాపేశ్వరం, ఏడిద, ద్వారపూడి, కేశవరం తదితర గ్రామాల్లో బోర్లపై వరినారు మడులను ముందుగా వేశారు. ముందుగా వరినారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్లు ప్రారంభించారు.

పరిస్థితులు వ్యతిరేకం

జూన్ 1వ తేదిన కాలువలకు నీరు పూర్తి స్థాయిలో విడుదల కాలేదు. దీనికి తోడు నైరుతి రుతుపవనాలు ఆశించినంత వేగంగా కదలక పోవడంతో వర్షాలు సమృద్ధిగా కురవలేదు. మరోపక్క ఎండలు వేసవిని తలపిస్తున్నట్లుగా ఉన్నాయి. దీంతో ఖరీఫ్ పనులు ఊపందుకోలేదు. టైలెండ్ భూములకు పూర్తి స్థాయిలో నీరు చేరలేదు. ఇన్ని పరిస్థితుల నడుమ నారుమడులు వేయని రైతులు వెదజల్లు విధానంలో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. కూలీల కొరతను దృష్టిలో ఉంచుకుని వెదజల్లు సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ఏడాది 60శాతం మేర వెదజల్లు సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రారంభంలోనే..

ఖరీఫ్ వరినాట్లు ప్రారంభంలోనే కూలీ రేట్లు అధికంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. వరినాట్లు వేసే మహిళా కూలీకి రూ.300, ఆకుతీతకు పురుషులకు రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు. వరినాట్లు ఊపందుకుంటే కూలీల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు.

బోర్లపై సాగు



జూన్ నెలాఖరు నాటికి ఊడ్పులు పూర్తయితే రబీ పంటకు అనువుగా ఉంటుంది. కాలువలకు సాగునీరు విడుదల చేసినా..టైలెండ్ భూములకు చేరడంలో జాప్యం చోటు చేసుకుంది. అందుకే బోర్లపై సాగు చేస్తున్నాం.

– కొవ్వూరి వెంకటరెడ్డి(ఎర్ర శ్రీను), రైతు, పసలపూడి

వరినాట్లు పైపైన వేయాలి



కుదురుకు ఒకటి లేదా రెండు మొక్కలు ఉండేలా పైపైన నాట్లు వేయాలి. చదరపు మీటరుకు 33 కుదుళ్లు ఉంటేటట్లు నాట్లు వేసుకోవాలి. వెదజల్లు సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలి. వెదజల్లు సాగుతోనే ముందస్తు సాగుకు అవకాశముంటుంది. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఎంటీయు1318 సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, మండపేట.

మండల వైద్యాధికారిగా రత్నసుధ



రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల వైద్యాధికారిగా డాక్టర్ ఎం.రత్నసుధ బాధ్యతలు స్వీకరించారు. కె.గంగవరం మండలం కుందూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న ఆమె ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారిగా బదిలీ పై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పీహెచ్‌సీ వైద్యాధికారిగా, డివిజనల్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన ఎస్.ప్రశాంతి బదిలీపై సామర్లకోట వెళ్లారు.

మమ్మేలవమ్మా.. మహాలక్ష్మి


అమ్మవారికి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రాయవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల కొంగుబంగారంగా నీరాజనాలు అందుకుంటున్న రాయవరంలోని మహాలక్ష్మి అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న అమ్మవారికి ఆషాఢమాసం ముందుగా జాతర నిర్వహించి మరుసటి రోజు తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అమ్మవారిని వివిధరకాల పుష్పాలు, నోట్ల కాగితాలతో అలంకరించారు. చిన్నారుల నుంచి వద్ధుల వరకు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ నేతలు తాడి వెంకటరామారెడ్డి, కర్రి గోపాలకృష్ణారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి(పీఎస్ఆర్), మందుల షాపు శ్రీను, సత్తి వెంకటసుబ్బారెడ్డి, సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలి


ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రామచంద్రపురం: గ్రామ సచివాలయ ఉద్యోగుల్లో ఇప్పటికీ కొన్ని శాఖల వారికి ప్రమోషన్ చానల్ చూపలేదని, ప్రభుత్వం వెంటనే వారికి సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్ కల్పించి ఆ తర్వాత మాత్రమే రేషనలైజేషన్ చేయాలని కోరుతూ నియోజకవర్గానికి చెందిన గ్రామ సచివాలయ ఉద్యోగులు ఆర్డీవో అఖిలకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ సీనియారిటీ జాబితా విడుదల చేసి దాని ప్రకారం పారదర్శకంగా బదిలీలు జరపాలని కోరారు. సొంత మండలంలో ఐదేళ్లు పూర్తయిన వారు వేరే మండలం బదిలీ తప్పనిసరి అనే నిబంధన సవరించాలన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు జీవో నంబర్ 5ని సవరించి జీవో నంబర్ 6 ఇచ్చినట్టుగానే తమకు కూడా సొంత మండలంలో పనిచేసే అవకాశం కల్పించాలని కోరారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే సచివాలయ ఉద్యోగులు ముఖ్యంగా మహిళా ఉద్యోగులు వేరే మండలానికి తప్పనిసరి బదిలీ వల్ల విధి నిర్వహణలో పలు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్స్‌కు సంబంధించిన ఉత్తర్వులు, పెండింగ్‌లో ఉన్న బకాయి సొమ్ములు వెంటనే విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వారు పేర్కొన్నారు.

వరి సాగులో నారుమడి దశే కీలకం


వి అశోక్, మండల వ్యవసాయాధికారి


నూటికి 90 శాతం పైబడి మొలకెత్తిన నాణ్యమైన వరి విత్తనాలు

కాజులూరు: ఏ రకం పంటల సాగులోనైనా విత్తనం బలంగా ఉంటేనే పైరు ఆరోగ్యం పెరుగుతుందనేది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం తూర్పుడెల్టాలోని వరి సాగు భూముల్లో పంట దమ్ములు నిర్వహిస్తూ నారుమడులు చల్లుకునేందుకు సిద్ధమౌతున్నారు. డివిజన్‌లో కొందరు రైతులు నారుపోసి నాట్లు వేసే విధానాన్ని అవలంభిస్తుండగా, కొందరు రైతులు వెదచల్లిక (నేరుగా వరి విత్తనాలను చదును చేసిన పొలంలో చల్లడం) విధానాలను అవలంభిస్తున్నారన్నారు. వెదజల్లు విధానంలో మొలక శాతం తక్కువగా ఉన్నట్లయితే వరి మొక్కల మధ్య దూరం పెరుగుతుంది. నారుమడుల విధానంలోనూ మొలక శాతం తక్కువగా ఉన్నట్లైతే నారుకొరత ఏర్పడుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు ముందుగానే వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరిశీలించి విత్తనాలు చల్లుకోవాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు.

విత్తనాల మొలకశాతాన్ని పరిశీలించే విధానం

విత్తనాల మొలకశాతాన్ని పరిశీలించేందుకు ముందుగా పలుచనిగుడ్డ, లేదా సరైన కాగితాన్ని తీసుకుని మడతలు, మడతలుగా చేయాలి. 100 వరి విత్తన గింజలను తీసుకుని మడతల మధ్య ఉంచి దానిని 24 గంటలు పూర్తిగా నీటిలో నానబెట్టాలి. తర్వత పైకి తీసి 24 గంటలు పొడిగుడ్డా లేదా గడ్డితో కప్పి మండీ కట్టాలి. ఐదు రోజుల తర్వాత మొలక శాతాన్ని లెక్కకట్టాలి. 80 గింజలు తక్కువ కాకుండా మొలకెత్తినట్లయితే అవి నాణ్యమైనట్టుగా గుర్తించి మొత్తం విత్తనాలను నానబెట్టుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. వ్యవసాయ సేద్యంలో విత్తన దశ ఎంతో కీలకమైనదని రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారానే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం బస్ స్టాండ్ సమీపంలోని వాటర్ వర్క్స్ వద్ద నూతనంగా నిర్మించే 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.2.62 విద్యుత్ శాఖ ఇంప్రూవ్‌మెంట్ ఫండ్స్ అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న ఈ సబ్ స్టేషన్‌తో పట్టణంలోని విజయలక్ష్మీ నగర్, వీరభద్రపురం, మెయిన్ రోడ్డు, విజయమహల్, రాజారత్న థియేటర్ సెంటర్, కలువపువ్వు సెంటర్, గాంధీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా మెరుగవుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పట్టాభిరామయ్య చౌదరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వరప్రకాష్, ఏపీఈపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రాజబాబు, మండపేట ఏఈ మునియ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.10 వేల విరాళం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవగోపాలస్వామి ఆలయ అన్నదాన పథకానికి విశాఖపట్నం వాస్తవ్యుడు ప్రతాప సాయిశంకర్–పద్మహేమమాలిని దంపతులు రూ.10,116 విరాళంగా అందజేసినట్టు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. దాతలకు ఆశీర్వచన మండపం వద్ద ఆలయ సిబ్బంది, పండితులు స్వామివారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు.

నిత్యాన్నదానానికి..

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన జున్నూరి నాగలక్ష్మి మంగళవారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును దాత ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయక రావుకు అందజేశారు. దాతను అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

బదిలీలను మండలానికే పరిమితం చేయాలి


మండపేటలో ఎంపీడీఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): తమను ప్రస్తుతం పని చేస్తున్న మండల పరిధిలోని వేరే గ్రామాలకే బదిలీ చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలంటూ గ్రామ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండపేట ఎంపీడీఓ సత్యనారాయణమూర్తికి సచివాలయ ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులను అదే పట్టణ పరిధిలోని వార్డుల్లోకి మాత్రమే బదిలీ చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అదే పద్ధతిలో తమను మండల పరిధిలోని గ్రామాలకు మాత్రమే బదిలీ చేయాలని కోరుతున్నామన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ అమలులో మిగులు సిబ్బందికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలు జారీచేయాలని కోరారు. కార్యక్రమంలో మండపేట మండలంలోని గ్రామాల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మరమ్మతుల్లో రాజీ పడవద్దు


మండపేటలో నిర్మాణ పనులపై చర్చిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం(మండపేట): బురుగుంట చెరువు పార్కు వద్ద ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి స్థానిక అధికారులను ఆదేశించారు. అమలాపురం ఈఈఎంటీ హుస్సేన్‌తో కలిసి మంగళవారం నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో రాజీపడవద్దని ఆదేశించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకూ ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా స్థానిక ప్రజలకు నీటి సరఫరాను సమస్యలు లేకుండా కొనసాగించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట పలువురు పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవం


నగరంలో నిత్యహోమంలో పాల్గొన్న భక్త దంపతులు


మామిడికుదురు: నగరం గ్రామంలోని బీఎస్‌మూర్తి రోడ్డులోని శ్రీహరి క్షేత్రంలో కొలువైన శ్రీహనుమాన్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి వార్ల ఆలయంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం నిత్య హోమం, సుదర్శన నారసింహ సహిత రామ పంచముఖ హనుమాన్ హవనం, అన్న సమారాధనలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాశి ఆదిశేష శ్రీనివాస్ (నాని) ఆధ్వర్యంలో నిత్య హోమం అనంతరం స్వామి వార్ల 15వ వార్షిక కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అన్నమాచార్య భక్త రామదాసు సంకీర్తనలతో 108 మంది దంపతులతో కల్యాణోత్సవాన్ని వేద పండితులు రమణీయంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ కల్యాణోత్సవ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు.

ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ రకాలు వేసుకోవాలి


కొత్తూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ మణిదీప్, రైతులు

రామచంద్రపురం రూరల్: రైతులు ఖరీఫ్‌లో ఎంటీయూ 7029 స్వర్ణకి ప్రత్యామ్నాయంగా ఉన్న రకాలు వేసుకోవాలని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ రైతులకు సూచించారు. మండలంలోని కొత్తూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలయిందన్నారు. త్వరగా రైతులంతా దమ్ములు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎంటీయూ 7029 స్వర్ణకి ప్రత్యామ్నాయంగా ఉన్న రకాలు వేసుకోవాలన్నారు. ఎంటీయూ 1318 రకం వర్షాలకు పడని రకంగా తెలిపారు. విత్తనం మొలక కట్టుకుని విత్తనశుద్ధి చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న యంత్రాలు, ఎరువులు తదితర వివరాలకు రైతులకు తెలియజేశారు. ప్రతి రైతు ఖరీఫ్ సీజన్‌లో ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కట్టుకోవాలని సూచించారు. ఆగస్టు 15 చివరి తేదీగా తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు జి. దుర్గాభవాని, రైతులు గరిగిపాటి సూర్యనారాయణ, వైట్ల రామకృష్ణ, నూనె ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


దాకి తేజ | యార్లగడ్డ నందిని | సాయి రేవంత్ | అల్లం బాలగంగాధర్ | పట్నాల సాయి నాగేశ్వరరావు


దాకే ఆకాంక్ష | చోడిశెట్టి నాగ విజయ మహేశ్వరి | పేరాబత్తుల ప్రసన్న | అరవపల్లి ఈశ్వరి

కె.గంగవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చూపించి రాష్ట్రంలోని వివిధ చోట్ల ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ఎంఈఓలు ఎ.నాగరాజు, ఆంజనేయులు తెలిపారు. దంగేరు ఉన్నత పాఠశాలకు చెందిన అల్లం బాలగంగాధర్, పట్నాల సాయి నాగేశ్వరరావు, సాయి రేవంత్, పామర్రు ఉన్నత పాఠశాలకు చెందిన యార్లగడ్డ నందిని, కుందూరు ఉన్నత పాఠశాలకు చెందిన దాకి తేజ ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంపై ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, గ్రామ సర్పంచ్‌లు కొప్పిశెట్టి రమణ, వాసంశెట్టి వెంకటదుర్గ, పంపన సత్యనందం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఇద్దరు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి మంగళవారం విలేకరులకు తెలిపారు. దాకే ఆకాంక్ష శ్రీకాకుళం క్యాంపస్‌కు, చోడిశెట్టి నాగ విజయ మహేశ్వరి ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులను గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గ్రామానికి చెందిన పేరాబత్తుల ప్రసన్న 576 మార్కులతో మండల ప్రథమ స్థానంలోనూ, అరవపల్లి ఈశ్వరి 571 మార్కులతో ద్వితీయ స్థానంలోనూ నిలిచారు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో వారిద్దరూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ సంస్థకు ఎంపికయ్యారు. విద్యార్థులిద్దరినీ ఎంఈఓ కె.తాతారావు, హెచ్‌ఎం ఎస్వీ నాగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.